nipuna
Every Wednesday Free Supplement
05.
29 నవంబర్ 2023
పేజీలు 8

**డాక్టర్ కిరణ్**

ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (ఏఐఎఫ్-జీడీఏ) జాతీయ సమన్వయకర్తగా నిజామాబాద్ జిల్లాకు చెందిన డాక్టర్ కిరణ్ మాదాల నవంబర్ 4న ఎన్నికయ్యారు. ముంబైలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షుడిగా డాక్టర్ రాజేశ్ గైక్వాడ్‌ను ఎన్నుకున్నారు. డాక్టర్ కిరణ్ ప్రస్తుతం నిజామాబాద్ జిల్లా దవాఖానలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర మీడియా సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. 2017 నుంచి ఈసీ మెంబర్‌గా ఉన్నారు.

# నియోజకవర్గాల పునర్విభజన – సవాళ్లు

**నియోజకవర్గాల పునర్విభజన / వర్గీకరణ (Delimitation) అనేది ప్రధానంగా కార్యనిర్వాహక, శాసన వ్యవస్థల కార్యకలాపం. మహా అయితే రాజకీయ నాయకులు, విశ్లేషకులు, విద్యావేత్తల చర్చల్లోని అంశం. కానీ ప్రస్తుతం అనేక మంది నియోజకవర్గాల పునర్విభజన, స్థానాల పెంపుపై ఉత్సుకత ప్రదర్శిస్తున్నారు. దానికి ఒక కారణం 40 ఏండ్ల క్రితం ఉన్న జనాభాకు అనుగుణంగా ఉన్న శాసనసభ స్థానాల సంఖ్య. ఆ తర్వాత పెరిగిన జనాభాకు అనుగుణంగా ఇంతవరకు పెరగకపోవడం, ఒకవేళ పెరిగితే కొన్ని రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోనుండటం ఒక కారణం కాగా మరో కారణం దశాబ్దాల ఎదురుచూపుల తర్వాత చట్టసభల్లో మహిళలకు దక్కిన రిజర్వేషన్లకు ఉన్న ఆఖరి అడ్డంకి డీలిమిటేషనే కావడం.**




## డీలిమిటేషన్ అంటే?

- పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రాదేశిక నియోజకవర్గాల సరిహద్దులను సర్దుబాటు చేసి ప్రజాప్రాతినిధ్యం సమంగా ఉండేలా చేసే ప్రక్రియ డీలిమిటేషన్ (నియోజకవర్గాల పుర్విభజన/వర్గీకరణ).

## డీలిమిటేషన్ – రాజ్యాంగ ప్రకరణలు

- భారత రాజ్యాంగ ప్రకరణ 82 ప్రకారం ప్రతి జనాభా లెక్కల తర్వాత పార్లమెంట్ ఒక డీలిమిటేషన్ చట్టాన్ని రూపొందించాల్సి ఉంటుంది. ఈ చట్టం అమల్లోకి రాగానే కేంద్ర ప్రభుత్వం ఒక డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది.
- ప్రకరణ 170(2)(3) ప్రకారం రాష్ట్రాలను ప్రాదేశిక నియోజకవర్గాలుగా పార్లమెంట్ చేసిన డీలిమిటేషన్ చట్టాన్ని అనుసరించి విభజించారు.

## చట్టాలు – కమిషన్లు

- భారతదేశంలో తొలి డీలిమిటేషన్ ప్రక్రియను 1950-51లో ఎలక్షన్ కమిషన్ సహాయంతో భారత రాష్ట్రపతి నిర్వహించారు. అనంతరం 1952లో డీలిమిటేషన్ చట్టాన్ని ఆమోదించారు.
- మొత్తంగా భారతదేశంలో ఇంతవరకు నాలుగు సార్లు (1952, 63, 73, 2002) డీలిమిటేషన్ కమిషన్లను ఏర్పాటు చేశారు.
- 1981, 91 జనాభా లెక్కల తర్వాత డీలిమిటేషన్ ప్రక్రియ జరగలేదు. 1976లో అత్యవసర పరిస్థితి కాలంలో లోక్‌సభ స్థానాల సంఖ్యను ఫ్రీజ్ చేశారు (యథాతథంగా స్థిరీకరించారు). ఆ తర్వాత డీలిమిటేషన్ ప్రక్రియను 2001 వరకు నిలిపివేశారు. అప్పటికి అమల్లో ఉన్న జనాభా నియంత్రణ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని తక్కువ జనాభా ఉన్న రాష్ట్రాలు నష్టపోకుండా, అన్ని రాష్ట్రాలు ఒక సమస్థాయికి చేరేవరకు ఈ ప్రక్రియ వాయిదా వేయాలని నిర్ణయించారు.
- 2002లో జరిగిన డీలిమిటేషన్ ప్రక్రియ 2001 జనాభా లెక్కల ప్రకారం జరిగింది. అయితే మొత్తం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల సంఖ్య 1971 జనాభా లెక్కల ప్రకారమే ఉంచారు.
- జనాభా నియంత్రణ పటిష్టంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు తక్కువ స్థానాలు పొంది నష్టపోకుండా, జనాభాను సరిగా నియంత్రించకుండా అధిక జనాభా వల్ల ఎక్కువ స్థానాలు ఉత్తరాది రాష్ట్రాలు పొందకుండా ఈ ఏర్పాటు చేశారు.
- 2002లో వచ్చిన 84వ రాజ్యాంగ సవరణ నియోజకవర్గాల పునర్విభజన కార్యక్రమాన్ని 2026 తర్వాత వచ్చే తొలి జనాభా లెక్కల వరకు నిలిపివేసి, అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను కూడా ఫ్రీజ్ చేసింది (యథాతథంగా ఉంచింది).
- ప్రకరణ 170 (1) ప్రకారం ప్రతి రాష్ట్ర అసెంబ్లీకి ప్రత్యక్షంగా ఎన్నికయ్యే ప్రజాప్రతినిధుల సంఖ్య 60కి తగ్గకుండా 500లకు పెరగకుండా ఉండాలి.
- అదేవిధంగా రాజ్యాంగ ప్రకరణ 80 ప్రకారం రాజ్యసభకు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చే ప్రతినిధుల సంఖ్య 238కు మించరాదని, రాజ్యాంగ ప్రకరణ 81 ప్రకారం లోక్‌సభకు ఎన్నికయ్యే సభ్యుల సంఖ్య 550 కంటే ఎక్కువ ఉండరాదన్న పరిమితి ఉంది.

## కమిషన్ – నిర్మితి

- ఈ డీలిమిటేషన్ కమిషన్‌ను రాష్ట్రపతి నియమిస్తారు.
- కేంద్ర ఎలక్షన్ కమిషన్‌తో సమన్వయం (Collabo ration) చేసుకొని పని చేస్తుంది.
- ఇది ఒక చట్టబద్ధ సంస్థ. డీలిమిటేషన్ కమిషన్ యాక్ట్ ప్రకారం ఏర్పాటు చేస్తారు.
- దీనికి సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నాయకత్వం వహిస్తారు.
- దీనిలో కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్, రాష్ట్రాల ఎలక్షన్ కమిషనర్లు సభ్యులుగా ఉంటారు.

**విధులు, అధికారాలు**

1) అన్ని లోక్‌సభ, అసెంబ్లీ ప్రాదేశిక నియోజకవర్గాల్లో జనాభా సాధ్యమైనంత సమంగా ఉండటానికి నియోజకవర్గాల సంఖ్య పెంచడం, వాటి సరిహద్దులను పునర్విభజించడం చేస్తారు (నియోజకవర్గాల సంఖ్య పెంపుపై ప్రస్తుతం రాజ్యాంగ సవరణ ద్వారా కొంతకాలం పాటు నిషేధం విధించారు).
2) షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ జాతుల జన సంఖ్యను బట్టి ఆయా నియోజకవర్గాలను వారికి రిజర్వ్ చేసే అంశాన్ని పరిశీలిస్తుంది.




3) కమిషన్‌లో మెజారిటీ అభిప్రాయం ఆధారంగా నిర్ణయాలుంటాయి.
4) కమిషన్ ప్రతిపాదిత అంశాల డ్రాఫ్ట్‌ను కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ గెజిట్లలోను, అన్ని స్థానిక భాషల వార్తాపత్రికల్లోను ప్రజా పరిశీలనార్థం ప్రచురిస్తారు.
5) కమిషన్ పబ్లిక్ సిట్టింగ్స్ ఏర్పాటు చేసి ప్రజల నుంచి మౌఖిక, రాతపూర్వక వినతులు, సూచనలు, సలహాలు స్వీకరిస్తుంది. సమంజసం అనుకుంటే వాటిని తుది నివేదికలో చేరుస్తుంది.
6) తుది నివేదికను కేంద్ర, రాష్ట్ర గెజిట్లలో ప్రచురిస్తారు. రాష్ట్రపతి నిర్ణయించిన తేదీ నుంచి అమల్లోకి వస్తుంది.
7) ఈ నివేదికాంశాలు తదుపరి జనాభా లెక్కల అనంతరం కొత్త డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటయ్యే వరకు అమల్లో ఉంటాయి.
8) తుది నివేదికను కేంద్ర, రాష్ట్ర శాసనసభల పరిశీలనార్థం ఆయా సభలకు నివేదిస్తారు. కానీ ఎటువంటి మార్పులు చేర్పులు అనుమతించరు.
9) డీలిమిటేషన్ కమిషన్ ఒక 'హైపర్ బాడీ'. దాని ఆజ్ఞలు చట్టాలతో సమస్థాయి కలిగి ఉంటాయి. దీని నిర్ణయాలను ఏ కోర్టుల్లోను ప్రశ్నించడానికి వీల్లేదు.

## ఆవశ్యకత

- భారతీయ జనాభాతో పోలిస్తే వారి సంక్షేమానికి కృషి చేయాల్సిన ప్రజాప్రతినిధుల సంఖ్య కేంద్ర, రాష్ట్రాల్లో అతి తక్కువగా ఉంది. అమెరికాలో ఒక హౌస్ ఆఫ్ రిప్రజంటేటివ్ మెంబర్ సగటున 7 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తుండగా, పాకిస్థాన్‌లో మెంబర్ ఆఫ్ నేషనల్ అసెంబ్లీ మెంబర్ సగటున 6 లక్షల మందికి, బంగ్లాదేశ్‌లో ఈ నిష్పత్తి రమారమి 5 లక్షలుగా ఉంది. కానీ భారతదేశంలో ఒక ఎంపీ సగటున 25 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అందువల్ల శాసనసభ్యులపై శాసన నిర్మాణ (Law making) భారం ఎక్కువగా ఉండి, ప్రాధాన్య అంశాలపై కూడా దృష్టి సారించలేకపోతున్నారు.
- అదేవిధంగా క్షేత్ర స్థాయిలో అసంఖ్యాకంగా రాజకీయ నాయకులు ఉన్నప్పటికీ రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాల్లో సైతం ఈ లోటు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.
- 70వ దశకం తర్వాత నుంచి కేంద్ర, రాష్ట్ర శాసనసభ్యుల సంఖ్య పెంచకుండానే నియోజకవర్గాల సర్దుబాటు జరుగుతున్నందున 40 ఏండ్లలో ఇంచుమించు రెట్టింపైన జనాభా వారిపై పని భారాన్ని గణనీయంగా పెంచింది. కొన్ని ఉత్తరాది రాష్ట్రాల్లో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా ఉంది. ఉదాహరణకు ఒక ఉత్తరప్రదేశ్ ఎంపీ 30 లక్షల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.
- దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే ఉత్తరాదిన యూపీ, బిహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల ఎక్కువగా ఉండి ఈ సమస్య మరింత తీవ్రంగా మారింది. అయితే జనాభాను అనుసరించి జరిగే నియోజకవర్గాల పెంపు వల్ల జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి.
- జనాభా నియంత్రణలో అలసత్వం ప్రదర్శించిన రాష్ట్రాలు లబ్ధి పొందుతాయి. కానీ ఇదే కారణంతో గత నలభై ఏళ్లుగా నియోజకవర్గాల పెంపును నిలిపివేసినప్పటికీ జనాభాపరంగా సమత్వాన్ని సాధించలేకపోయాం. ఉదాహరణకు 1971లో రాజస్థాన్ జనాభా 25 మిలియన్లు కాగా, కేరళ జనాభా 21 మిలియన్లు. అదే 2011 నాటికి రాజస్థాన్ జనాభా 68 మిలియన్లకు చేరుకోగా, కేరళ జనాభా మాత్రం 33 మిలియన్లుగా ఉంది. అంటే జనాభా నియంత్రణ పరంగా ఆయా ప్రాంతాలవారీగా ఉన్న ధోరణుల్లో మార్పు సాధ్యంకాలేదు. అందువల్ల నియోజకవర్గాల పునర్విభజన చేసి, స్థానాల సంఖ్య పెంచితే లోక్‌సభ స్థానాల సంఖ్య 753కు చేరుతుందని అంచనా.
- తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలకు 6 శాతం పెరుగుదల దక్కగా, బిహార్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాలు 63 శాతం సీట్ల పెరుగుదల సాధిస్తాయి. అందువల్ల హిందీ మాట్లాడే ఉత్తరాది రాష్ట్రాలు రాజకీయంగా, అధికారపరంగా లబ్ధి పొందుతాయి. ఇది చారిత్రకంగా కొన్ని జాతీయ పార్టీలకు సైతం లబ్ధి చేకూరుస్తున్న అంశం. కానీ విపరీతంగా పెరిగిన ఈ జనాభా అంతరాలను తగ్గించమనేది స్వల్ప కాలంలో సాధ్యమయ్యే పని కాదు. కాబట్టి నియోజకవర్గాల పెంపు కారణంగా కొన్ని రాష్ట్రాలు నష్టపోకుండా ఉండాలంటే ఇతర పరిష్కార మార్గాలను నిపుణులు సూచిస్తున్నారు. అవి..

1) నియోజకవర్గాల పునర్విభజన కేవలం జనాభా ప్రాతిపదికనే ఉండరాదు. భౌగోళిక అంశాలు, ఆర్థికపర అంశాలు, భాష, చారిత్రక అంశాలు, సమన్యాయ దృక్పథం కూడా పరిగణనలోకి తీసుకొని ఈ పుర్విభజన ఉండాలి.
2) డీలిమిటేషన్ వల్ల పెరిగే శాసనసభ స్థానాలు ఎక్కువగా జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాలకు దక్కి రాజకీయంగా, అధికారపరంగా ఆయా ప్రాంతాలు లబ్ధి పొంది ఇతర ప్రాంతాలు నష్టపోకుండా ఉండాలంటే జనాభా అధికంగా ఉన్న రాష్ట్రాల నుంచి కొత్త రాష్ట్రాలను ఏర్పాటు చేయాలి. అన్ని రాష్ట్రాల్లో జనాభా సమస్థాయిలో ఉండే విధంగా రాష్ట్రాల విభజన జరగాలి. తద్వారా అన్ని రాష్ట్రాలకు పార్లమెంటులో సమ ప్రాతినిధ్యం ఉంటుంది.
3) అదేవిధంగా రాజ్యసభలో రాష్ట్రాలకు సమ ప్రాధాన్యం కల్పించడం, ఏ రాష్ట్రం వారు ఆ రాష్ట్రం నుంచే ఎంపిక కావాలనే నియమం తీసుకురావడం వల్ల అన్ని రాష్ట్రాలు సమంగా ప్రాతినిధ్యం కలిగి ఉంటాయి.

- ప్రస్తుతం ఉన్న శాసనసభ్యుల మధ్యే ఏకాభిప్రాయం కుదరకపోవడంతో తరచూ సభలు వాయిదా పడటం, చర్చలు సవ్యంగా జరగకపోవడం, అవినీతి, కుంభకోణాలు, పదవుల కోసం పార్టీ ఫిరాయింపులు, అస్థిర ప్రభుత్వాలు వంటి సమస్యలు ఉన్నాయి. శాసనసభ్యుల సంఖ్య కంటే మరింత పెరిగితే ఈ సమస్యలు మరింత తీవ్రమై అరాచక పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందని మరికొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విధంగా డీలిమిటేషన్ ప్రక్రియ సౌలభ్యాలతోపాటు కొన్ని సమస్యలనూ వెంటబెట్టుకొని రానుంది.
- ఈ సమస్యలకు పరిష్కారం ప్రజల్లో రాజకీయ చైతన్యం పెంచడం, ఆ రాజకీయ చైతన్య సాధనకు అక్షరాస్యతను పెంపొందించడం వంటి మార్గాలు సైతం ఉన్నాయి.

**మల్లవరపు బాలలత**
సివిల్స్ ఫ్యాకల్టీ
సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ,
హైదరాబాద్

